
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 1 మార్చి 2024



మాడుగుల మరిడిమాంబ
ఆలయంలో చోరీ

- అమ్మవారి ఆభరణాలు అపహరణ
- హుండీలు పగులగొట్టి నగదు తస్కరణ
- సీసీ కెమెరాలు ధ్వంసం

.7లో


గుడి బయట వదిలేసిన హుండీలు

రాష్ట్రంలో రాక్షస పాలన

వైసీపీ నేతల అవినీతిని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు

- గంజాయి, కల్తీ మద్యం, ఇసుక మాఫియాకు అడ్డాగా ఏపీ
- యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేవు
- ఒక తరం భవిష్యత్తును జగన్ నాశనం చేశారు
- నారా భువనేశ్వరి ధ్వజం
- వైసీపీ అరాచక పాలనకు ఓటుతో అంతం పలకాలని పిలుపు
- టీడీపీ-జనసేన ప్రభుత్వంతో అందరికీ న్యాయం జరుగుతుందని భరోసా
- చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో 'నిజం గెలవాలి' కార్యక్రమాలు
- చంద్రబాబు అరెస్టుతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేత
- భువనేశ్వరిని చూడడానికి భారీగా తరలివచ్చిన మహిళలు


బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

అనకాపల్లి/ రోలుగుంట/ రావికమతం/ బుచ్చెయ్యపేట/, ఫిబ్రవరి 29: వైసీపీ నాయకులు నరరూప రాక్షసుల్లా ప్రవర్తిస్తూ, వారి అక్రమాలను ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతున్నారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలం జేపీ అగ్రహారం, కొవ్వూరు, రావికమతం మండలం గంపవానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం, ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం అరబుపాలెం, వాడ్రాపల్లి, గొల్లలపాలెం గ్రామాల్లో పర్యటించారు. గత ఏడాది చంద్రబాబు అక్రమ అరెస్టుతో తీవ్రమనస్తాపానికి గురై గుండెలు ఆగిన పలువురి కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కొవ్వూరు, గంపవానిపాలెం, ఆర్.భీమవరం గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం గ్రామంలో హంసవేణి అనే మహిళ చేతిపంపు నుంచి తాగునీరు రావడం లేదని ఫిర్యాదు చేసిందనే కోపంతో వైసీపీ నాయకులు ఆమెపై దాడి చేసి రెండు కళ్లు పీకేసి తమ రాక్షసత్వాన్ని చూపారన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న, కల్తీ మద్యం గురించి ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలను వైసీపీ నాయకులు పొట్టనబెట్టుకున్నారని అన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్ర ... మిగతా 8వ పేజీలో


రోలుగుంట మండలం కొవ్వూరులో యర్రంశెట్టి సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న భువనేశ్వరి


మునగపాక మండలం గొల్లలపాలెంలో మొల్లి అప్పలనర్స కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న నారా భువనేశ్వరి

స్కూల్ విద్యార్థులతో భువనేశ్వరి...

అనకాపల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): 'నిజం గెలవాలి' పర్యటనలో భాగంగా జిల్లాలో పర్యటిస్తున్న నారా భువనేశ్వరి గురువారం సాయంత్రం మునగపాక మండలం అరబుపాలెంలో పర్యటించారు. ఈ సమయంలో అటుగా వస్తున్న ఒక ప్రైవేటు స్కూల్ బస్సులో వున్న విద్యార్థులు భువనేశ్వరిని చూసి చేతులు ఊపుతూ అభివాదం చేశారు. దీంతో ఆమె కారు దిగి స్కూల్ బస్సు ఎక్కారు. కొద్దిసేపు పిల్లలతో ముచ్చటించారు. పేర్లు, ఏ తరగతి చదువుతున్నది అడిగి తెలుసు కున్నారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేసి, బాగా చదువుకోవాలని చెప్పారు.


అరబుపాలెం వద్ద ఒక ప్రైవేటు పాఠశాల బస్సులో విద్యార్థులకు చాక్‌లెట్లు ఇస్తున్న నారా భువనేశ్వరి


నర్సీపట్నం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

38 కేంద్రాల్లో నిర్వహణ

- ఫస్టియర్- 13,323 మంది, సెకండియర్- 15,298 విద్యార్థులు
- అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు, 144 సెక్షన్
- పరిసరాల్లో జిరాక్స్, నెట్ సెంటర్లు మూసివేత

అనకాపల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం 38 పరీక్షా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 28,621 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 13,323 మంది, ద్వితీయ సంవత్సరం 15,298 మందిఎ విద్యార్థులు వున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 38 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 38 మంది సూపరింటెండెంట్లను నియమించారు. కాపీయింగ్, ఇతర అక్రమాలు జరక్కుండా రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్, నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీచేశారు. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుంది. అర్ధ గంట ముందు నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. తొమ్మిది గంటలు దాటిన తరువాత ఎవరినీ లోపలికి అనుమతించేది లేదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి సుజాత స్పష్టం చేశారు.

ఇదిలావుండగా ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిపించాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం ఆయా శాఖల అధికారులతో వెబ్‌ఎక్స్‌లో మాట్లాడారు. అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. పోలీసు స్టేషన్లలో భద్రపరిచిన ప్రశ్నాపత్రాలను పోలీస్ బందోబస్తుతో పరీక్షా కేంద్రాలకు తీసుకువెళ్లాలన్నారు.

కాగా ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం బడి బస్సులు కాకుండా ఆరు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని పీటీడీ అనకాపల్లి డిపో అధికారులు తెలిపారు. దేవరాపల్లి మండలం తెనుగుపూడి, పరవాడ మండలం తానాం, కోటవురట్ల మండలం తాళ్లపాలెం, ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లి, చీడికాడ మండలం కోనాంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల విద్యార్థుల కోసం ఈ బస్సులను ఏర్పాటు చేశామన్నారు.

హైవే భూముల్లో గ్రావెల్ దందా

సాగరమాల రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూముల్లో అక్రమ తవ్వకాలు

- ఎన్‌హెచ్‌ఏఐ పరిధి కావడంతో పట్టించుకోని స్థానిక అధికారులు
- వంగలి ఎంఐటీ భూముల్లో సైతం గ్రావెల్ తవ్వకాలు


అమృతపురం వద్ద ఎన్‌హెచ్‌ఏఐ భూముల్లో చేపట్టిన మట్టి, గ్రావెల్ తవ్వకాలు

సబ్బవరం, ఫిబ్రవరి 29: **ప్రభుత్వ భూములు ఖాళీగా వుంటే చాలు మట్టి, గ్రావెల్ గ్యాంగ్ బరి తెగిస్తున్నది. తమ సొంత భూములుగా భావిస్తూ యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్ లారీల్లోకి లోడింగ్ చేసి చుట్టుపక్కల ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ లోడ్ రూ.1,000, లారీ అయితే రూ.3 వేలు, డంపర్ లారీ రూ.6 వేలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.**

కేంద్ర ప్రభుత్వం సాగర మాల పథకం కింద సబ్బవరం మండలం అమృతపురం రెవెన్యూ పరిధి సూరెడ్డిపాలెం నుంచి చింతగట్లఅగ్రహారం, పెందుర్తి మండలం చింతగట్ల, జెర్రిపోతులపాలెం నరవ తదితర గ్రామాల మీదుగా షీలానగర్ వరకు ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మించాలని పదేళ్ల క్రితం ప్రణాళికను తయారు చేసింది. ఇందుకోసం రైతు నుంచి జిరాయితీ భూములతోపాటు ప్రభుత్వ భూములను కూడా అధికారులు సేకరించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల రోడ్డు నిర్మాణ పనులు ఆరంభంలోనే ఆగిపోయాయి. అప్పటి నుంచి భూములు ఖాళీగా వున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించిన భూములపై అక్రమార్కుల కళ్లు పడ్డాయి. యంత్రాలతో ఇష్టానుసారంగా మట్టి, గ్రావెల్ తవ్వేస్తున్నారు. దీంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఈ భూములు ఎన్‌హెచ్‌ఏఐ ఆధీనంలో వుండడంతో స్థానికంగా వుండే రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు తమకు సంబంధం లేదని పట్టించుకోవడంలేదు. దీంతో అక్రమార్కులకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. అమృతపురం, చింతగట్లఅగ్రహారం, చింతగట్ల, జెర్రిపోతులపాలెం, నరవ తదితర గ్రామాల వద్ద జాతీయ రహదారి భూముల్లో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.


వంగలి సమీపంలో ఎంఐటీకి కేటాయించిన భూముల్లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

ఎంఐటీ భూముల్లోనూ తవ్వకాలు

మండలంలోని వంగలి గ్రామంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎంఐటీ (మద్రాసు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) సంస్థ ఏర్పాటుకు ఐఐపీఈ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ) విశ్వవిద్యాలయానికి అనుకొని 200 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం ఈ భూములన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ కూడా కొన్ని రోజులుగా గ్రావెల్ తవ్వేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఇళ్లనిర్మాణంలో పునాదులు ఎత్తు చేయడానికి, ఖాళీ స్థలాల్లో నింపడానికి గ్రావెల్ తరలిస్తున్నారు. ట్రాక్టర్ లోడు రూ.1,000 నుంచి రూ.1,200, లారీ లోడు రూ.3 వేల నుంచి రూ.3,500కు, డంపర్ లారీ అయితే రూ.5-6 వేలకు విక్రయిస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

టమాటా ధర ఢమాల్



- రైతుకు దక్కేది కిలోకు రూ.4!
- పెట్టుబడి కూడా చేతికి దక్కదని ఆవేదన

గొలుగొండ/ కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 29: **టమాటా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. సుమారు 25 కిలోల టమాటాలు వుండే క్రేట్ రూ.100కు తగ్గిపోయింది. కిలోకు నాలుగు రూపాయలు మాత్రమే చేతికి అందుతాయని, ఈ రేటు అయితే పెట్టుబడి కూడా దక్కదని రైతులు వాపోతున్నారు.**


గొలుగొండ మండలం జోగంపేటలో టమాటాలను క్రేట్లలో నింపుతున్న రైతులు

మండలంలోని జోగంపేట, గొలుగొండ, పాతమల్లంపేట, సాలికమల్లవరం, కొత్తఎల్లవరం, పాలకపాడు, ఏటిగైరంపేట, ఏఎల్‌పురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం తదితర గ్రామా ల్లో రైతులు రబీ పంటగా టమాటా సాగు చేశారు. జనవరి నుంచి వాతావరణం అనుకూలంగా వుండడంతో కాపు బాగా కాసింది. సుమారు మూడు వారాల నుంచి దిగుబడి వస్తున్నది. అప్పట్లో 25 కిలోల క్రేట్ రూ.250 నుంచి రూ.300 వరకు ధర పలకడంతో రైతులు సంతోషించారు. అయితే అన్ని గ్రామాల్లోని పొలాల్లో టమాటా దిగుబడి పెరగడంతో, వ్యాపారులు తగ్గించేశారు. రాజమండ్రి, విశాఖపట్నం నుంచి వ్యాపారులు పొలాల వద్దకు వచ్చి 25 కిలోల క్రేట్ టమాటాలు రూ.100కు కొనుగోలు చేస్తున్నారు. వారం క్రితం క్రేట్ రూ.200 వుందని, ఇంతలోనే సగానికి ఎలా తగ్గిస్తారని రైతులు ప్రశ్నించగా, ఇతర ప్రాంతాల్లో కూడా టమాటా పంట చేతికి వస్తుండడంతో ధరలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. కాగా కృష్ణాదేవిపేట చుట్టుపక్కల వున్న గొలుగొండ, కొయ్యూరు మండలాల్లోని పలు గ్రామాల రైతులు టమాటాలను కృష్ణాదేవిపేట మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. నాణ్యతను బట్టి క్రేట్ టమాటాలు రూ.100 నుంచి రూ.150 ధర పలికాయి. అయినప్పటికీ కొనుగోలుదారుల కోసం మధ్యాహ్నం వరకు ఎదురుచూడాల్సి వచ్చింది. కాగా తమ వద్ద కిలో రూ.4కు కొనుగోలు చేస్తున్నారని, ఇవే టమాటాలు రిటైల్‌గా కిలో రూ.15 నుంచి రూ.20కి అమ్ముతున్నారని రైతులు వాపోతున్నారు. ఎకరా టమాటా సాగుకు రూ.30 వేల వరకు పెట్టుబడి అతుందని, దిగుబడి ఎనిమిది నుంచి పది టన్నులు వస్తుందని రైతులు చెబుతున్నారు. 25 కిలోలు రూ.100కు అమ్మితే పెట్టుబడి కూడా చేతికి రాదని వాపోతున్నారు.


కృష్ణాదేవిపేట మార్కెట్‌లో టమాటా క్రేట్లతో కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

చేపల చెరువుల్లో తనిఖీలు

- అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్టు నిర్ధారణ
- 47 మందికి నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దేవరాపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన చేపల చెరువులను మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు తనిఖీ చేశారు. 'అడ్డగోలుగా చేపల చెరువులు' అన్న శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. మత్స్యశాఖ ఫీల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి టి.నాగమణి, ఆర్.ఐ. ఎస్.సతీశ్, వీఆర్వోలు జగదీశ్, నూకరాజు, కానిస్టేబుల్ హరిబాబు బృందం గురువారం 11 గ్రామాల్లో పర్యటించింది. చేపల చెరువులకు అనుమతులు లేకపోవడమే కాకుండా చేపలకు ఆహారంగా కుళ్లిన మాంసం వ్యర్థాలను వేస్తున్నట్టు గుర్తించారు. అదే విధంగా నిషేధిత జాబితాలో వున్న క్యాట్ ఫిష్ (జెల్ల) రకం చేపల పెంపకాన్ని చేపట్టినట్టు తనిఖీల్లో బయటపడింది. ఎటువంటి అనుమతులు లేని 47 చెరువుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. చేపలకు ఆహారంగా మాంసం వ్యర్థాలను వేసినా, క్యాట్ ఫిష్ పెంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


చేపల చెరువుల నిర్వాహకులకు నోటీసు ఇస్తున్న మత్స్య శాఖ అధికారిణి నాగమణి

అనకాపల్లి జిల్లాలో నిజం గెలవాలి

» మృతుల కుటుంబాలకు భువనేశ్వరి ఓదార్పు

నిజం గెలవాలి పర్యటనలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో గురువారం పర్యటించారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. భువనేశ్వరి జనంతో మమేకమయ్యారు. ఆమెను చూసేందుకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అందర్నీ భువనేశ్వరి ఆప్యాయంగా పలకరించారు.



మునగపాక మండలం అరబుపాలెం గ్రామంలో నారా భువనేశ్వరి పరామర్శిస్తున్న సందర్భంగా కన్నీరు పెట్టుకుంటున్న బడ్డేడ నాయుడు కుటుంబ సభ్యులు



రోలుగుంట మండలం జేపీ అగ్రహారంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న భువనేశ్వరి




రావికమతం మండలంలో మహిళలతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

చింతపండు రైతు దిగాలు

» కోనాం సంతలో లభించని గిట్టుబాటు ధర

» కిలో రూ.30 నుంచి రూ.35లకు విక్రయం

చీడికాడ, ఫిబ్రవరి 29: మండలంలో కోనాం సంతకు వచ్చిన ఏజెన్సీ చింతపండుకి ఆశించిన ధర లభించక గిరిజన రైతులు దిగాలు చెందారు. మండలంలోని కోనాం పంచాయతీతో పాటు హుకుంపేట, అనంతగిరి మండలాలకు చెందిన పలు ఏజెన్సీ గిరిజన గ్రామాల నుంచి గురువారం కోనాం సంతకు చింతపండు తీసుకువచ్చారు. ఏజెన్సీ గ్రామాల్లో తుప్పలు, డొంకల నుంచి నడుచుకుంటూ వేకువజామున బయలుదేరి ఉదయం 9 గంటలకు కోనాం చేరుకున్నారు. గత వారం చింతపండుకి కిలో రూ.65లు నుంచి రూ.70ల వరకు ధర పలకడంతో ఈ వారం కూడా ఎక్కువ ధర వస్తుందని ఆశించిన గిరిజనులు ఎక్కువ చింతపండును తీసుకువచ్చారు. అయితే ఈ వారం ధర రూ.30ల నుంచి రూ.35లు పలకడంతో గిరిజన రైతులు నిరాశకు గురయ్యారు. అయితే ఈ గురువారం జిల్లాలో పలు శుభకార్యాలు ఉండడంతో వ్యాపారులు కూడా ఎక్కువ మంది రాకపోవడంతో మధ్యాహ్నం వరకు వేచి చూసిన గిరిజనులు కొంతమంది కోనాంలో వారి బంధువుల ఇంటి వద్ద చింతపండు నిల్వ చేయగా, మరికొంతమంది గిరిజనులు వ్యాపారులు అడిగిన ధరకు అమ్మి నిత్యావసర ధరలు కొనుగోలు చేసుకొని నిరాశతో స్వగ్రామాలకు వెళ్లిపోయారు.



కోనాంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింతపండు

'బాల్య వివాహాలను అరికట్టడంలో విఫలం'

నర్సీపట్నం, ఫిబ్రవరి 29: బాల్య వివాహాలను అరికట్టడంలో సచివాలయం మహిళా పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం ఆరోపించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధక చట్టం 2006, 2023 నిబంధనలపై డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2025 నాటికి బాల్య వివాహాలు నిర్మూలన లక్ష్యంగా పెట్టుకుందన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో సచివాలయంలోని మహిళా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. బాల్య వివాహం ఆపినట్టు కాగితాల్లో చూపుతున్నారని, అదే వివాహం పక్క ఊర్లోనో... గుడిలోనో జరిగిపోతుందని చెప్పారు. ఈ విధంగా 13 అనధికార వివాహాలు జరిగినట్టు ఆధారాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాలపై ఎఫ్ఐఆర్‌లు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాల విషయంలో రాజకీయ నాయకుల జోక్యం ఉంటే భయపడవద్దని సూచించారు. ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో గత నాలుగు నెలల్లో 86 బాల్య వివాహాలను ఆపామని తెలిపారు. ఆర్డీవో హెచ్‌వీ జయరాం మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువు మీద శ్రద్ధ పెట్టాలని సూచించారు. మంచి విద్య అందిస్తే ఏ పథకాలు, ఎవరి మీద ఆధారపడే పరిస్థితి రాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త, ఎంఈవో తలుపులు, సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర బాలల పరిరక్షణ పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

భువనేశ్వరిని కలిసిన టీడీపీ సీనియర్ నేతలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 29: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని నర్సీపట్నంలోని రాయల్ పార్కు రిసార్ట్స్‌లో ఆ పార్టీ సీనియర్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. న్యాయం గెలవాలి యాత్రలో భాగంగా భువనేశ్వరి అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించి పెదబొడ్డేపల్లిలోని రాయల్ పార్క్ రిసార్ట్స్‌లో బుధవారం రాత్రి బస చేసిన విషయం తెలిసిందే. గురువారం నర్సీపట్నం నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నేతలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర తదితరులు భువనేశ్వరిని కలిశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా బలంతో పాటు దైవ బలం తోడై చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ అనకాపల్లి నూకాంబిక అమ్మవారికి పూజలు చేసి తీసుకొచ్చిన అమ్మవారి చిత్ర పటాన్ని ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళి, బొడ్డేడ జోగినాయుడు, పోలవరపు త్రినాథ్, బుద్ద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భువనేశ్వరికి నూకాలమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న టీడీపీ నేతలు

జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్

అనకాపల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నాయని, టీడీపీ, జనసేన సంయుక్తంగా తాడేపల్లిగూడెంలో బుధవారం నిర్వహించిన జెండా సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని, జగన్‌రెడ్డి నిద్రలేని రాత్రులు గడుపుతున్నాడని అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమన్నారు. టీడీపీ, జనసేన వ్యక్తిగత ప్రయోజనాల కోసం చేతులు కలపలేదన్నారు. ఐదు కోట్ల మంది ఆంధ్ర రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం రెండు పార్టీలు కలిశాయన్నారు. టీడీపీ, జనసేన కూటమితో కలిసి వచ్చి రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలిపారన్నారు. జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకెళ్లారని విమర్శించారు. వైసీపీ వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెటర్ హనుమ విహారి పారిపోయాడన్నారు. వైనాట్ 175 అంటున్న జగన్‌రెడ్డికి మనం ఎందుకు ఓటు వేయాలో అడుగుతున్నామన్నారు.

జగన్ ఏం సాధించాడని, జాబ్ క్యాలెండర్ ఎక్కడ?, డీఎస్సీ ఎక్కడ? ఉచిత ఇసుక ఎక్కడ? అని నాగజదీశ్ ప్రశ్నించారు. పులివెందులలో జగన్‌రెడ్డికి ఓటమి తప్పదని అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే సూపర్ 6ను ప్రవేశపెట్టారని, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే బ్లూప్రింట్ టీడీపీ దగ్గర ఉందన్నారు. ప్రజల సొమ్ము దోచుకోకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని ఆయన చెప్పారు.



టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

రాజ్యాంగ పరిరక్షణకు ఎన్నికలే కీలకం

» ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సులో వక్తలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణే కీలకమని, ఆ దిశగా ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం 'భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అన్న అంశంపై ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్య ఇండియా పార్టీ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు అసాధారణమైనవని, రాజ్యాంగ రక్షణ కోసమని ప్రజలు భావించాలన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం, స్వేచ్ఛ, సమానత్వం, లౌకికతత్వం భూస్థాపితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని, రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం బుట్టదాఖలు చేసిందన్నారు. సీబీఐ మాజీ ఉన్నతాధికారి వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ ద్వారకవద్ద సముద్ర గర్భంలో పర్యటించారని, బంగాళాఖాతంలో పర్యటిస్తే ఏపీకి ఇచ్చిన విభజన హామీలు, ప్రత్యేక హోదా వంటివి తెలిసేవన్నారు. ఢిల్లీ పాలకుల మెడలు వంచుతామని చెప్పుకున్న నాయకులు అక్కడ తమ మెడలే వంచుకుని వస్తున్నారని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖపట్నానికి కేంద్రం అన్ని విధాలుగా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ రమేష్, సిఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఓబులేసు, జగ్గునాయుడు, ఎం.పైడిరాజు, విమల, విజయరావు, సీతామహాలక్ష్మి ప్రసంగించారు.



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

క్రైం... crime news

మరిడిమాంబ ఆలయంలో చోరీ

» అమ్మవారి ఆభరణాల అపహరణ

» హుండీలు పగులగొట్టి నగదు తస్కరణ

» సీసీ కెమెరాలు ధ్వంసం

మాడుగుల, ఫిబ్రవరి 29: మాడుగుల శివారు ఖండివరం వెళ్లే మార్గం పంటపొలాల మధ్యలో ఉన్న మరిడిమాంబ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఆలయ నిర్వాహకులు ఎప్పటిలాగానే బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయానికి తలుపులు వేసి వెళ్లిపోగా, అర్ధరాత్రి సమయంలో ఆలయం ఉత్తరం వైపుగా ఉన్న గేట్ల తాళాలను దొంగలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి మెడలోని వెండి హారం, చెవిదుద్దులు అపహరించారు. అలాగే అమ్మవారి ఆలయంలో గల రెండు హుండీలను విరగ్గొట్టి అందులో నగదు అపహరించి ఆ హుండీలను ఆలయ సమీపంలో పడేశారు. అయితే గతంలో ఇదే మాదిరిగా చోరీ జరగడంతో అప్రమత్తమైన కమిటీ సభ్యులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు హార్డ్ డిస్క్, మానెటర్‌ను కూడా పట్టుకుపోయారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు.



వెలవెలబోతున్న అమ్మవారి విగ్రహం



సీసీ కెమెరా వైర్లను పీకి పారేసిన దృశ్యం



గుడి బయట పారేసిన హుండీలు

కొలిక్కిరాని పింఛన్ నగదు చోరీ కేసు

» ఏడాది గడిచినా రికవరీ కాని సొమ్ము

మాకవరపాలెం, ఫిబ్రవరి 29: పింఛన్ నగదు చోరీ కేసు ఏడాది గడిచినా ఇంకా కొలిక్కి రాలేదు. మండలంలో శెట్టిపాలెం సచివాలయం కార్యదర్శి నవ్యశ్రీ మాకవరపాలెం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు నుంచి 2023 ఏప్రిల్ 3వ తేదీ మధ్యాహ్నం రూ.16,15,750 నగదు తీసుకువెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆ నగదును చోరీ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు దర్యాప్తు చేస్తున్నా ఈ కేసులో ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు. దీనిపై ఎస్ఐ రామకృష్ణారావు వివరణ కోరగా ఇటీవల నక్కపల్లిలో పింఛన్ నగదు చోరీ కేసులో కొందరిని అరెస్టు చేశామని, వారే మాకవరపాలెం పింఛన్ నగదు చోరీ కేసులో ఉన్నారన్నారు. అయితే చోరీకి గురైన నగదు రికవరీ కాలేదన్నారు. దీనిపై ప్రస్తుత ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పింఛన్ నగదు చోరీపై అప్పటి ఎంపీడీవో అరుణశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు.

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

కొత్తూరు, ఫిబ్రవరి 29: మండలంలోని శంకరం జాతీయ రహదారి పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. భట్లపూడి గ్రామానికి చెందిన టి.నూకరాజు(62) అనకాపల్లి నుంచి ఆటో వస్తున్నాడు. శంకరం వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా అదే మార్గంలో సబ్బవరం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

టూరిజం సర్క్యూట్ బస్సులు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మంత్రి రోజా

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ, పిలిగ్రిమ్ పాత్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో కలిసి టూరిజం సర్క్యూట్ బస్సులను గురువారం ప్రారంభించింది. బీచ్ రోడ్డు నోవాటెల్ ఎదురుగా పర్యాటక శాఖ మంత్రి రోజా బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి బస్సులు దోహదపడతాయన్నారు. ఇందులో భక్తులకు శీఘ్ర దర్శనం, విశేష పూజ ఉంటాయన్నారు. తిరుమల, శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటి, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, అమరావతి, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట, పిఠాపురం తదితర 18 ప్రసిద్ధ ఆలయాలను అనుసంధానం చేస్తూ ప్యాకేజీరూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, రవిబాబు, ఏపీటీడీసీ ఛైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, పర్యాటక శాఖ ఎండీ కన్నబాబు, జేపీ మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై రోజూ టాటానగర్- ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం, ఫిబ్రవరి 29: ప్రయాణికుల సౌకర్యార్థం టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ సర్వీసుల ఫ్రీక్వెన్సీని పెంచుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రస్తుతం వారానికి రెండు రోజులుగా నడుస్తున్న ఈ సర్వీసులు ఇకపై ప్రతిరోజు అందుబాటులో ఉంటాయన్నారు. 18189 నంబరు గల టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ మార్చి ఏడు నుంచి, తిరుగు ప్రయాణంలో 18190 నంబరు గల ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ మార్చి పది నుంచి ప్రతిరోజూ నడిచేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ సర్వీసులకు మూడు సెకండ్ ఏసీ, ఏడు థర్డ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ ఎకానమీ, నాలుగు స్లీపర్, ఒక జనరల్ క్లాసు, ఒక ఏసీ ప్యాంటీ కార్, రెండు సెకండ్ క్లాసు, రెండు సెకండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

బయ్యవరంలో చందనోత్సవం రేపు

కశింకోట, ఫిబ్రవరి 29: మండలంలోని బయ్యవరం గ్రామంలో ఉన్న హజరత్ అన్సర్ మద్‌ని ఔలియా దర్గాలో మార్చి 2న 72వ ఉరుస్ చందనోత్సవం జరగనున్నదని ఉత్సవం కార్యదర్శి జనాబ్ మహమ్మద్ అయాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి ఇషానమాజ్ తరువాత ఖురాన్‌ఖానీ, మిలాద్ షరీఫ్ (చందనోత్సవం) కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. శనివారం ఉదయం నుంచి గుసుల్ షరీఫ్ చందనం పూస్తారన్నారు. రాత్రి 10 గంటల నుంచి దర్గా ప్రాంగణంలో ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.



చందనోత్సవానికి సిద్ధమైన దర్గా

భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య జాతర రాట

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 29: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా గురువారం అమ్మవారి బాలాలయంలో రాట ముహూర్తాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి జాతర ఏప్రిల్ ఏడో తేదీ రాత్రి ప్రారంభం కానుందని, ఎనిమిదో తేదీన కొత్త అమావాస్య పూజలు జరగనున్నాయని ఆలయ ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. తొమ్మిదో తేదీన ఆలయంలో ఉగాది వేడుకలు జరుగుతాయన్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, ధర్మకర్తలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్ఠ బందోబస్తు

» ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 29: జిల్లాలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలపై గురువారం ఆయన వివరించారు. ఈ మేరకు ఆయన పోలీసు కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలో 38 కేంద్రాల్లో 28,621 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, వీరంతా ఉదయం ఎనిమిది గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం తొమ్మిది గంటలకు ఒక్క నిమిషం దాటినా అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయన్నారు. పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రం నుంచి విద్యార్థులను బయటకు అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ

» పరిశీలించిన కలెక్టర్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 29 : జిల్లా పోలీస్ కార్యాలయ సమీపాన భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్‌మిషన్ (ఈవీఎం) స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా ఆయన ఈ స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించడంతోపాటు సీల్‌ను కూడా పరిశీలించారు. సీసీ టీవీల ఫుటేజిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఏఎస్పీ విజయభాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రామ్మూర్తి, డీటీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లపై ఎస్పీతో చర్చిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ఎస్పీని కలిసిన నర్సీపట్నం డీఎస్పీ మోహన్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 29: నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీఆర్ఆర్ మోహన్ గురువారం ఎస్పీ కేవీ మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూల మొక్కను అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి డీఎస్పీకి ఎస్పీ పలు సూచనలు చేశారు.



ఎస్పీకు పూలమొక్కను అందిస్తున్న డీఎస్పీ మోహన్

ఈ నెల నుంచి రాగి పిండి సరఫరా : జేసీ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 29 : జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, పంచదార, గోధుమపిండితోపాటు రాగి పిండిని మార్చి నెల నుంచి ఇంటింటికి సరఫరా చేయబడుతుందని జేసీ జాహ్నవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగి పిండిని కేజీ రూ.11లకు అందించనున్నామని, జిల్లాలో 5.5 లక్షల రైస్ కార్డుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రాగి పిండి కావాల్సిన రైస్‌కార్డుదారులు బియ్యంకు బదులుగా రాగిపిండి తీసుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

నక్కపల్లి, ఫిబ్రవరి 29: ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లు నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ ఎ.విజయ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక నూకతాత ఆటో యూనియన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. మద్యం సేవించి డ్రైవ్ చేయడం, అతివేగంగా ఆటోలను నడపడం, ఆకస్మికంగా ఆటోలను హైవేపై ఎక్కడపడితే అక్కడ ఆపేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. రహదారి భద్రత గురించి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

తుమ్మపాల, ఫిబ్రవరి 29 : భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996వ సంవత్సరంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి 22 లక్షల మంది కార్మికులకు సంక్షేమాన్ని అందించడం జరిగేదన్నారు. కార్యక్రమంలో కార్మికసంఘం నాయకులు చిన్న, అప్పలనాయుడు, అప్పలరాజు, వెంకటేష్‌పాల్గొన్నారు.

రోడ్డు దుస్థితిపై వినూత్న నిరసన

అచ్యుతాపురం, ఫిబ్రవరి 29: రాంబిల్లి మండలం పెదకలవలాపల్లికి చెందిన రావి దేముళ్లు అనే వ్యక్తి రోడ్డు దుస్థితిపై వినూత్న నిరసన తెలియజేశారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రాంబిల్లి మండల వాసులు కూడా అనకాపల్లి వెళ్లాలంటే ఈరోడ్డుగుండానే వెళ్లాలి. మూడేళ్లలో రాంబిల్లి మండలానికి చెందిన చాలా మంది ఈ రోడ్డులో ప్రమాదానికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నా రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోలేదని ఆయన అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకు పాదయాత్ర చేశారు. రోడ్డు పక్కన ఉన్న మొక్కలు, చెట్టుకొమ్మలను విరిచి కనబడిన గోతిలో ఒక కొమ్మ వేసుకుంటూ పోయారు.

చినతీనార్లలో సచివాలయం, ఆర్‌బీకేలు ప్రారంభం

నక్కపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని చినతీనార్లలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను గురువారం సాయంత్రం ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ గ్రామాల్లోనే సేవలందించేలా సీఎం జగన్ దూరదృష్టితో ఈ వ్యవస్థకు రూపకల్పన చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ ముసలయ్యామాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు లొడగల చంద్రరావు, సూరకాసుల గోవింద్, గొర్ల బాబూరావు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన

నక్కపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని జి.జగన్నాథపురంలో గురువారం డ్రిప్ ఇరిగేషన్ వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ లక్ష్మి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఎరువులను నేరుగా మొక్కకు అందించే సదుపాయం కలుగుతుందన్నారు. రైతుకు సమయం కలిసివస్తుందని, ఎరువులు వృథా కావని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరణం ఈశ్వరరావు, బుజ్జమ్మ, రజిత పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : డీఈఓ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 29 : స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలలో గురువారం జరిగిన ఈఎండీపీ జిల్లా స్థాయి ఎక్స్‌పోను డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 13 పాఠశాలల విద్యార్థులు తమ తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో జడ్పీ హైస్కూల్ ఉప్పరపల్లి, జడ్పీహైస్కూల్ వీరనారాయణం విద్యార్థులు ప్రథమ, ద్వితీయస్థానాలకు ఎంపికయ్యారు. వీరికి డీఈవో బహుమతులు అందజేశారు. ఈ రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. డైట్ లెక్చరర్ సోమయాజులు, కమిటీ సభ్యులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, ఏఎంఓ మురళీపట్నాయక్, డీసీఐబి సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి డి.కాళిదాసు, మండల అధికారి పాల్గొన్నారు.





మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు మనస్తాపానికి గురై మునగపాక మండలం అరబుపాలెంలో మృతిచెందిన బొడ్డేడ నాయుడు కుటుంబసభ్యులకు చెక్కును అందిస్తున్న భువనేశ్వరి, అలాగే వాడ్రాపల్లిలో మృతి చెందిన ఉల్లూరి అప్పలనరస చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భువనేశ్వరి, తర్వాత ఉల్లూరి మంగాయ్యమ్మ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న భువనేశ్వరి

ఇంటర్ పరీక్షలు సజావుగా జరిపించాలి : కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 29 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిపించాలని అధికారులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వెబ్‌ఎక్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పరీక్షా కేంద్రంలో పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ బందోబస్తుతో కేంద్రాలకు తీసుకువెళ్లాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు వీలుగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పరీక్ష అయిన వెంటనే పోస్టు ద్వారా జవాబు పేపర్లు పంపించాలన్నారు. సమావేశంలో ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి సుజాత, డీఆర్‌ఓ దయానిధి పాల్గొన్నారు.

సబ్బవరంలో..

ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సబ్బవరంలో గురుకుల కళాశాల/పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురుకుల కళాశాల్లో మొదటి సంవత్సరం 301 మంది, రెండో సంవత్సరం 299 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మొదటి సంవత్సరం 362, రెండో సంవత్సరం 272 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ప్రిన్సిపాల్స్ సీహెచ్‌వీవీ సత్యారావు, వర్మ తెలిపారు. విద్యార్థుల కోసం బెంచీలు, ఫ్యాన్లు, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. గురువారం సీఐ పిన్నింటి రమణ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలతోపాటు పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఒక్కో పరీక్షా కేంద్రం వద్ద ముగ్గురు పీసీలు, ఇద్దరు విలేజ్ పోలీసులను బందోబస్తుకు ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

నక్కపల్లిలో..

ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభం కానున్నాయి. నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకులంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం మండలంలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఈ కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. గురువారం నక్కపల్లి సీఐ విజయ్ కుమార్ ఈ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్నంతసేపు 144 సెక్షన్ అమలులో వుంటుందన్నారు.

అనకాపల్లి టౌన్‌లో..

జిల్లాలో శుక్రవారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం బడి బస్సులు కాకుండా ఆరు పీటీడీ బస్సులను ఏర్పాటు చేశామని పీటీడీ అనకాపల్లి డిపో అధికారులు తెలిపారు. దేవరాపల్లిలోని తెనుగుపూడి, పరవాడ మండలం తానాం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి, కోనాంలోని గురుకుల పాఠశాల విద్యార్థుల కోసం ఈ బస్సులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆరు బస్సుల్లో తానాం గురుకుల పాఠశాలకు రెండు బస్సులు కేటాయించామన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా



ధర్నాలో కూర్చున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 29 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. 12వ పీఆర్సీ జులై-2023 నుంచి అమలుపరచాలని, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సీపీఎస్ డీఏల మొత్తాలను 90 శాతం క్యాష్ రూపంలో తక్షణమే చెల్లించాలని, గత డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఉపాధ్యాయులను రెగ్యులర్ టైమ్ స్కేల్‌లో నియమించాలని, ఇటీవల ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయులను తిరిగి బదిలీ చేయాలని నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, మాజీ కార్యదర్శి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండల కేంద్రంలో గురువారం ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ ప్రతినిధులు ఆందోళన చేశారు. ఏపీటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కె.ధర్మారావు,రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు మాట్లాడుతూ దీర్ఘకాలిక ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వై.కృష్ణ, సీహెచ్. అప్పలరాజు, వై.శ్రీనివాసరావు, పీవీ గణేశ్, ఎం.సత్యనారాయణ,బీ శ్రీనివాసరావు,వీరభద్రరావు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు శుభపరిణామం : అనిత



అనిత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు


నక్కపల్లి, ఫిబ్రవరి 29: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన నేతృత్వంలోని ప్రభుత్వం రావాలని అనేక మంది తమ పార్టీలో చేరుతున్నారని, ఇది శుభపరిణామమని తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. గురువారం సాయంత్రం స్థానికంగా వున్న ఆమె నివాసం వద్ద ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన 50మంది వైసీపీ కార్యకర్తలు మంతిన గోవింద్ నేతృత్వంలో టీడీపీలోకి చేరారు. టీడీపీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, తెలుగు యువత రాష్ట్ర ప్రతినిధి గుర్రం రామకృష్ణ సమక్షంలో టీడీపీలోకి చేరిన వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కట్టా అప్పలకొండ, అమలకంటి గోవింద్, బి.లోవరాజు,కె.శ్రీను, వి.బుజ్జి, రమణ, జీ సూర్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే నక్కపల్లికి చెందిన పలువురు టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ నేతృత్వంలో టీడీపీలో చేరారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడ్డూరి లోవరాజు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ నాయకులు అల్లాడ తాతారావు, దేవవరపు దొర,లోవరాజు, అల్లాడ రాము, పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభం

ఎలమంచిలి, ఫిబ్రవరి 29: ఎలమంచిలి ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలను గురువారం ఎమ్మెల్యే కన్నబాబు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి జెండా ఊపి ప్రారంభించారు. వాహన రాకపోకలు ప్రారంభించిన తర్వాత నేతలు, కార్యకర్తలంతా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫ్లైఓవర్‌పై ఇతర వాహనాలు రాకపోకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, నేతలు ఆడారి వెంకట్, యల్లపు నాగరాజు, సుందరపు బాబ్జీ, దాసరి కుమార్, పిల్లా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



వాహన రాకపోకలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కన్నబాబు, ఆడారి ఆనంద్





ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలన్నదే మోదీ ప్రధాన లక్ష్యం

పరవాడ, ఫిబ్రవరి 29: దేశంలో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రధానమంత్రి మోదీ పరిపాలన కొనసాగుతుందని బీజేపీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. పార్టీ చేపట్టిన ప్రజా పోరు యాత్ర-2ను గురువారం రావాడ పంచాయతీ బొట్టవానిపాలెం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు జగన్ ప్రభుత్వం తమ స్టికర్లను అంటించుకుని పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. పోరుయాత్ర రావాడ, ధర్మారాయుడుపేట గ్రామాల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో పార్టీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు జేవీఎస్ రాజు, కార్యదర్శి ముత్యాల అప్పారావు, బండారు రాజశేఖర్, సన్యాసిరావు, చిరుకు నాయుడు, వీరునాయుడు, సోమశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

... 5వ పేజీ తరువాయి

పరువు, ప్రతిష్ఠలు దిగజారిపోయాయని, ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు లేక యువత నిరుద్యోగులుగా మారిపోయారని ఆమె చెప్పారు. ఏపీని గంజాయి, కల్తీ మద్యం, ఇసుక మాఫియాలో నంబరు వన్ స్థానంలో నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందని దుయ్యబట్టారు. ఒక తరం భవిష్యత్తును జగన్ నాశనం చేశాడన్నారు. జగనాసుర పాలనకు మహిళలు తమ శక్తిని చూపించే తరుణం ఆసన్నమైందని, మీ పిల్లలతోపాటు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేసి, వైసీపీ రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం 'సూపర్ సిక్స్‌'ను అమలు చేస్తుందని, మహిళలకు మరిన్ని పథకాలను తీసుకువస్తుందని భరోసా ఇచ్చారు. 'జగనాసుర పాలనను అంతమొందిస్తాం, చంద్రబాబును మళ్లీ సీఎంను చేస్తాం' అంటూ మహిళలు విజయ సంకేతం చూపుతూ నినాదాలు చేశారు. రావికమతం మండలం గంపవానిపాలెం సభలో కిత్తంపేటకు చెందిన చెన్నంశెట్టి జగ్గమ్మ మాట్లాడుతూ, వెలుగు సీఏగా పనిచేస్తున్న తాను టీడీపీ సానుభూతురాలని కావడంతో స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ తనను ఉద్యోగంలో నుంచి తీసేయించారని కన్నీరుపెట్టుకుంది. భువనేశ్వరి స్పందిస్తూ చంద్రబాబు త్వరలో మళ్లీ సీఎం అవుతారని, వైసీపీ ప్రభుత్వ బాధితులందరికీ న్యాయం చేస్తారని భరోసా ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో తీవ్ర మనస్తాపానికి గురై చనిపోయిన బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం గ్రామానికి చెందిన అప్పలబత్తుల అయ్యన్నాచారి భార్య సత్యవతికి రూ.3 లక్షల చెక్కును అందచేశారు.

రావికమతం మండలం గంపవానిపాలెంలో మాకిరెడ్డి పెద్దిమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, పిల్లలను బాగా చదివించాలని మృతురాలి కుమారుడు రాజుబాబు, కోడలు భవానీకి సూచించారు. కాగా భువనేశ్వరి గంపవానిపాలెం వస్తున్నట్టు తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జై చంద్రబాబు, జై భువనమ్మ, జై టీడీపీ అంటూ నినాదాలు చేశారు.

రోలుగుంట మండలం జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన సుర్ల దేముడమ్మ, కొవ్వూరు గ్రామంలో యర్రంశెట్టి సత్యనారాయణ కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు.

మునగపాక మండల అరబుపాలెంలో బడ్డేడ నాయుడు, వాడ్రాపల్లిలో ఉల్లూరి అప్పలనరస, ఊల్లూరి మంగయ్యమ, గొల్లలపాలెంలో మొల్లి అప్పలనరస కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. మునగపాక మండలంలో పర్యటన అనంతరం భువనేశ్వరి అచ్యుతాపురం బయలుదేరి వెళ్లారు. రాత్రికి అక్కడ బసచేస్తారని పార్టీ వర్గాలు తెలిపారు.

నారా భువనేశ్వరి పర్యటనలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, టీడీపీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీజీ కుమార్, ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, దాడి రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి

సబ్బవరం, ఫిబ్రవరి 29 : రానున్న సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు ప్రజల సహకారం ఉండాలని సీఐ పిన్నింటి రమణ కోరారు. మండలంలోని బలిజపాలెం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఓటర్లు తగాదలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసులు కఠినమైనవనీ, ఎవరూ అటువంటి కేసుల్లో ఇరుక్కోవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ దనుంజయ్, సర్పంచ్ మామిడి శంకరరావు, గ్రామ పెద్దలు గొర్లి నూకరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముత్యాలనాయుడు సేవలు అభినందనీయం

సబ్బవరం, ఫిబ్రవరి 29 :మండల రిసోర్స్ కార్యాలయంలో 26 ఏళ్ల నుంచి మెసింజర్‌గా సేవలు అందిస్తున్న కె.ముత్యాలనాయుడు సేవలు అభినందనీయమని ఎంఈవో-1 లక్ష్మణరావు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగిగా 26 ఏళ్ల సర్వీసు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి రిటైర్ బెనిఫిట్ పొందకుండా రిటైర్ కావడం బాధాకరమన్నారు. ఆయన శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిచిపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయుడు, ఎల్.హేమంత్, ఎన్.అప్పలనాయుడు, పి.తమ్మారావు, మహేశ్, రమణ, కళాభారతి పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై మేకలు, గొర్రెల పెంపకందార్లకు రుణాలు

కోటవురట్ల, ఫిబ్రవరి 29: గొర్రెలు, మేకల కొనుగోలుకు 50 శాతంపై రుణాలు మంజూరు చేసినట్టు పాడేరు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశమందిరంలో పశుసంవర్ధక శాఖ వైద్యులకు సిబ్బందికి రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గొర్రెలు, మేకల రుణాలకు 600 దరఖాస్తులు వచ్చాయన్నారు. సమావేశంలో కోటవురట్ల ఏడీ సింహాద్రప్పడు, పాములవాక డాక్టర్ హరిప్రియ, కె.వెంకటాపురం డాక్టర్ బాబురావుపడాల్, తంగేడు డాక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ పార్కుని అభివృద్ధి చేయాలి'

పాయకరావుపేట, ఫిబ్రవరి 29 : పట్టణంలో అధ్వానస్థితిలో ఉన్న బీఆర్.అంబేడ్కర్ పార్కుని అభివృద్ధి చేయాలని దళిత కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జల్లూరి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ పార్కులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో విశాఖ జిల్లా డీడీగా పనిచేసిన మల్లికార్జునరావు కృషి ఫలితంగా పట్టణంలో అంబేడ్కర్ పార్కుని ఏర్పాటుచేశారన్నారు. ఈ పార్కును పట్టించుకోని కారణంగా అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అంబేడ్కర్ పార్కుని పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసి పూర్వవైభవం తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు నెలపర్తి అర్జున్, వేమగిరి లక్ష్మణరావు, బోడపాటి జగదీశ్, ఇంజరపు తేజ, పండు, రాజేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేస్తున్న హెచ్‌ఎంకు సన్మానం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 29: మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ రమణారావును పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బి శ్రీను, సర్పంచ్ రత్నం, మాజీ సర్పంచ్ వి. బంగారయ్య, ఉపాధ్యాయులు గారా ప్రకాష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు ఆలయం ప్రారంభం

కోటవురట్ల,ఫిబ్రవరి 29: మండలంలోని కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో అడవిరాజులుబాబుఆలయాన్ని ఏపీఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు గురువారం ప్రారంభించారు. గ్రామ ఉపసర్పంచ్ సిద్దబత్తుల నాగేశ్వరరావు దంపతుల సౌజన్యంతో అడవిరాజులుబాబు నూతన ఆలయాన్ని నిర్మించారు. గురువారం వేదపండితులు ప్రత్యేక పూజలు చేసిన ప్రాణప్రతిష్ఠ సూర్యనారాయణరాజు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి, సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, ఎంపీటీసీ సభ్యుడు సేనాపతి రాంబాబు, వైసీపీ యువనాయకులు చామంతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం రైల్వే అండర్‌పాస్‌కు నిధులు మంజూరు : ఎంపీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 29 : అనకాపల్లికి ఆనుకుని ఉన్న సత్యనారాయణపురం అండర్‌పాస్ రైల్వేబ్రిడ్జి, లంకెలపాలెం అండర్ రైల్వేపాస్ బ్రిడ్జిలకు కేంద్రం రైల్వే శాఖ రూ. 11 కోట్లు మంజూరు చేసిందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి చెప్పారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సత్యనారాయణపురం, లంకెలపాలెం ప్రాంత ప్రజల ఇబ్బందులను పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో రైల్వే శాఖ నిధులు మంజూరు చేసిందన్నారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తవుతుందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. నిధులు మంజూరు పత్రాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబుకు, సత్యనారాయణపురం పంచాయతీ సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మికి ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పలకా సత్తిబాబు, ఈశ్వరరావు, జోగా నాగేశ్వరరావు, సత్తిబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 29 : భూ యాజమాన్య హక్కు చట్టం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు వద్ద 64వ రోజు గురువారం న్యాయవాదులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో జీఆర్ఎస్ కుమార్, మద్దాల గోవింద, ఆర్ఆర్ కిరణ్, జి.భాస్కర్, అరుణ కూర్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయివెంకట లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా మరిడిమాంబ అమ్మవారి పండగ

పరవాడ, ఫిబ్రవరి 29 : రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెంలో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం అతి వైభవంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సారిపల్లి జోగినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పుర వీధుల్లో ఊరేగించి అనంతరం అనుపోత్సవం నిర్వహించారు.

తేగాడలో ఘనంగా దుర్గాలమ్మ పండుగ

కశింకోట, ఫిబ్రవరి 29 : మండలంలోని తేగాడలో దుర్గాలమ్మ పండుగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారినికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు స్టేజీ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సంత వేలం ఆశీలు ఖరారు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 29: మండలంలోని అచ్యుతాపురం, మోసయ్యపేట సంతల వేలం ఆశీలు బుధవారం ఖరారయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అచ్యుతాపురం సంతను గల్లా సన్యాసినాయుడు రూ.8.75 లక్షలకు, మోసయ్యపేట సంతను సారిపల్లి రమణ అప్పారావు రూ.7.75 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి.సురేష్ కుమార్, ఈవోపీఆర్డీ సీహెచ్.శ్రీరాములు నాయుడు, సర్పంచులు కూండ్రపు వెంకునాయుడు, పంచదార్ల పైడిరాజు, కార్యదర్శి కె.అమ్మాజీ, పుర్రె శ్రీనివాస యాదవ్, కూనిశెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల మహా గర్జనను జయప్రదం చేయండి

రాంబిల్లి, ఫిబ్రవరి 29: దివ్యాంగులకు అన్ని రంగాలలో సమాన హక్కులు కల్పించాలనే నినాదంతో మార్చి 9న నిర్వహిస్తున్న చలో అమరావతి దివ్యాంగుల మహా గర్జనను జయప్రదం చేయాలని ఎలమంచిలి నియోజకవర్గ వీహెచ్‌పీఎస్ కన్వీనర్ గాదం కాసులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి వేలాది మంది దివ్యాంగులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు రక్తహీనత నివారణపై అవగాహన

రాంబిల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని వెంకటాపురం యూపీ పాఠశాల విద్యార్థులకు గురువారం దిమిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ఎస్‌వీఎన్ రాజు మాట్లాడుతూ రక్తహీనత రాకుండా ఉండేందుకు ఆకుకూరలు తినాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

తుమ్మపాల, ఫిబ్రవరి 29 : పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు తుమ్మపాల గౌరీ సంఘం ఆధ్వర్యంలో మార్చి మూడో తేదీన విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుమ్మపాల జడ్పీ హైస్కూల్‌లో జరిగే ఈ టాలెంట్ టెస్టుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. టాలెంట్ టెస్టులో గెలుపొందిన వారికి నగదు బహుమతితోపాటు షీల్డ్‌లను బహూకరిస్తామని చెప్పారు.

'పేట'లో కొనసాగిన టీడీపీ ప్రచారం

పాయకరావుపేట, ఫిబ్రవరి 29 : టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై పట్టణంలో ఆ పార్టీ నాయకులు చేపట్టిన ప్రచారం గురువారం కొనసాగింది. పట్టణంలోని బృందావనం తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు చేపట్టిన ఇంటింటి ప్రచారంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను పాల్గొని ప్రజలకు సూపర్ 6 పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆది, చిరుకూరి పేర్రాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక దుర్గానగర్ కాలనీలో ఆ పార్టీ నాయకుడు సూరా సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు కశింకోట సత్తిబాబు, గంపల చినరాజు టీడీపీ సూపర్ 6 పథకాలపై ప్రచారం చేశారు.

డిగ్రీ కళాశాలలో అదనపు గదులు ప్రారంభం



ఎలమంచిలి డిగ్రీ కళాశాల నూతన గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్

ఎలమంచిలి, ఫిబ్రవరి 29: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీ.శే ఆడారి తులసీరావు జ్ఞాపకార్థం నిర్మించిన నూతన తరగతి గదులను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, ఎమ్మెల్యే కన్నబాబు, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ప్రారంభించారు. సుమారు రూ.50 లక్షలు వెచ్చించి మూడు తరగతి గదులు నిర్మించారు. అనంతరం సన్యాసమ్మ చెరువు వద్ద తులసీరావు జ్ఞాపకార్థం తులసీ ఉద్యానవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్‌చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, ఆడారి వెంకట్, మళ్ల కొండబాబు, దాసరి కుమార్, యల్లపు నాగరాజు, సుందరపు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అడ్డరోడ్డులో మహిళా మార్ట్ ప్రారంభం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 29: మండలంలోని అడ్డరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను గురువారం ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు తొలుత వస్తువులను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో డీపీఎం వరప్రసాద్, ఏరియా కో-ఆర్డినేటర్ సత్యవేణి, ఏపీఎం శివప్రసాద్, సీసీలు, ఈవోఏలు, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుండగా.. ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందినా స్థానిక సర్పంచ్‌తోపాటు వైస్ ఎంపీపీ, వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు వర్గానికి చెందిన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాళ్లు పాల్గొనకపోవడం చర్చనీయంగా మారింది.

నర్సీపట్నం నియోజకవర్గం

ఇండోర్ బాక్సింగ్ రింక్ నిర్మాణం ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 29 : పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఎదురుగా బాక్సింగ్ హాలు, రింక్ నిర్మాణానికి ఎమ్మెల్యే గణేశ్ శుక్రవారం భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ బాక్సింగ్ క్రీడాకారులకు శిక్షణ, టోర్నమెంట్లు నిర్వహించేందుకు వీలుగా ఈ పనులు చేపడుతున్నారు. దీని కోసం రుత్తల లచ్చాపాత్రుడు నందన వనంలోని స్కేటింగ్ రింక్ ప్రాంగణంలో మునిసిపల్ అధికారులు స్థలాన్ని కేటాయించారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పోర్ట్స్ సెస్ నుంచి రూ.60 లక్షలు మంజూరు చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, కమిషనర్ పూడి రవిబాబు, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన నాయుడు, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కర్రి శ్రీనివాసరావు, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ అసమర్థ పాలనతో ప్రజలకు అవస్థలు'



తాండవ జంక్షన్‌లో ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

నాతవరం, ఫిబ్రవరి 29 : మండలంలోని డి.యర్రవరం, తాండవ జంక్షన్ తదితర గ్రామాలలో బీజేపీ నాయకులు గురువారం ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపోరు యాత్ర కన్వీనర్ గవిరెడ్డి త్రినాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు అంటించుకుంటుండడమే తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. అనంతరం మోదీ పాలనలో అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పార్టీ నాయకులు లాలం వెంకటరమణ, తమరాన ఎర్రినాయుడు, పేరూరి బుల్లిదొర, సబ్బి కుమార్‌స్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ధర్నా

సీపీఎస్‌ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ ప్రతినిధుల డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకరాజు

నర్సీపట్నం, ఫిబ్రవరి 29 : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. నూకరాజు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీలో మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని, 11 పీఆర్‌సీ బకాయలు విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డీఏలు తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ అందోళన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. అప్పారావు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు కె.సత్యనారాయణ, ఆర్.వరహాలుబాబు, పూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తూ.తూ. మంత్రంగా 'ఉపాధి' పనుల ప్రజా వేదిక

ప్రజాప్రతినిధులు, కూలీలతో సహా పలువురు అధికారులు గైర్హాజరు



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ

మాకవరపాలెం, ఫిబ్రవరి 29 : ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన సామాజిక తనిఖీల్లో భాగంగా ప్రజా వేదికను ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం తూ.తూ. మంత్రంగా నిర్వహించారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఇద్దరు ముగ్గురు అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. ఉపాధి మేట్‌లతో పాటు కూలీలు కూడా వచ్చి వారి సమస్యలను ఇక్కడ తెలియజేయాల్సి ఉంది. కానీ వారుకూడా హాజరు కాలేదు. ఉపాధి వీఆర్‌పీలు, సోషల్ అడిట్ సిబ్బంది తప్ప మరెవ్వరూ లేకపోవడం గమనార్హం. అయినప్పటికీ అధికారులు తమ పనిని తాము పూర్తిచేశామన్నట్టు ముగించేయడం విశేషం. ఇదిలావుంటే, 2022- 2023 ఏడాదిగాను రూ.16.4 కోట్ల ఖర్చుపై సోషల్ అడిట్ జరిపారు. ఈ నిధుల ఖర్చుపై ఈ నెల16 నుంచి 25వ తేదీ వరకూ గ్రామాల్లో సోషల్ అడిట్ జరిపి, గ్రామ సభలు నిర్వహించారు.

ఈ పనులు జరిగే సమయంలో మస్తర్లు తప్పుల తడకగా ఉండడం కారణంగా రూ.30 వేలు పక్కదారి పట్టినట్టు సోషల్ అడిట్ బృందం గుర్తించినట్టు ఏపీవో వరలక్ష్మి తెలిపారు. అలాగే మరో రూ.11 వేలు రికవరీ పెట్టినట్టు అమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అడిషనల్ పీడీ రోజారాణి, విజిలెన్స్ అధికారిణి నిర్మలాదేవి, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించాలి'



మర్రిపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

నాతవరం, ఫిబ్రవరి 29 : పంచాయతీ కార్యదర్శులు స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో జె.రాంబాబు సూచించారు. మర్రిపాలెంలో గురువారం ఆయన పర్యటించి, ప్రభుత్వం కొత్తగా అందిస్తున్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని పరిశీలించారు.

డీటీగా రాజ్‌భరత్ బాధ్యతల స్వీకరణ

గొలుగొండ, ఫిబ్రవరి 29 : ఇక్కడి డిప్యూటీ తహసీల్దార్‌గా బి.రాజ్‌భరత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చియ్యపేట మండలం నుంచి ఇక్కడి బదిలీపై విచ్చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న ఆనందరావును ఉన్నతాధికారులు సబ్బవరం మండలానికి బదిలీ చేశారు.

ఇంటర్ పరీక్షలకు నర్సీపట్నం కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

నర్సీపట్నం, ఫిబ్రవరి 29 : ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు, బాలురు, బాలయోగి గురుకులం పాఠశాల, ఏబీఎం, రిషి, ప్రగతి, వివేకనంద, డాన్‌బాస్కో కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలను అధికారులు కల్పించారు. ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు పరీక్షలు నిర్వహిస్తారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించ కూడదని నిబంధన పెట్టారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టిక్కెట్లు పట్టుకొని నిర్ణీత సమాయానికి అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచిస్తున్నారు. మాస్ కాపీయింగ్ జరక్కుండా పక్కా ఏర్పాట్లు చేశారు. అన్ని గదుల్లో సీసీ కెమెరాలు అమర్చారు. బెంచీలపై హాల్ టిక్కెట్లు నెంబర్లు వేశారు. సెల్ ఫోన్లు, బ్లూటూత్‌లు, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు కేంద్రంలోకి అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు.

నగరం గ్రామంలో తాగునీటి సమస్యపై వినతి

మాకవరపాలెం, ఫిబ్రవరి 29 : మల్లవరం పంచాయతీ శివారు నగరం గ్రామంలో తాగునీటి కొరతతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ నర్సీపట్నం అధ్యక్షుడు అద్దెపల్లి గణేశ్ ఆధ్వర్యంలో పలువురు ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మికి గురువారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో గత కొద్ది కాలంగా ఏర్పడిన ఈ సమస్యపై అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. గ్రామంలో కొంత మంది కుళాయిలకు అక్రమంగా మోటర్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడతున్నారని ఆరోపించారు. ఈ కారణంగా తాగునీటి సమస్య ఏర్పడినట్టు చెపుతున్నారు. దీనిపై వెంటనే స్పందించాల్సిందిగా గణేశ్‌తో పాటు రాజా, రమణ, పలువురు గ్రామస్తులు కోరారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

... 5వ పేజీ తరువాయి

పరువు, ప్రతిష్ఠలు దిగజారిపోయాయని, ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు లేక యువత నిరుద్యోగులుగా మారిపోయారని ఆమె చెప్పారు. ఏపీని గంజాయి, కల్తీ మద్యం, ఇసుక మాఫియాలో నంబరువన్ స్థానంలో నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందని దుయ్యబట్టారు. ఒక తరం భవిష్యత్తును జగన్ నాశనం చేశాడన్నారు. జగనాసుర పాలనకు మహిళలు తమ శక్తిని చూపించే తరుణం ఆసన్నమైందని, మీ పిల్లలతోపాటు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేసి, వైసీపీ రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం 'సూపర్ సిక్స్'ను అమలు చేస్తుందని, మహిళలకు మరిన్ని పథకాలను తీసుకువస్తుందని భరోసా ఇచ్చారు. 'జగనాసుర పాలనను అంతమొందిస్తాం, చంద్రబాబును మళ్లీ సీఎంను చేస్తాం' అంటూ మహిళలు విజయ సంకేతం చూపుతూ నినాదాలు చేశారు. రావికమతం మండలం గంపవానిపాలెం సభలో కిత్తంపేటకు చెందిన చెన్నంశెట్టి జగ్గమ్మ మాట్లాడుతూ, వెలుగు సీఏగా పనిచేస్తున్న తాను టీడీపీ సానుభూతురాలని కావడంతో స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ తనను ఉద్యోగంలో నుంచి తీసేయించారని కన్నీరుపెట్టుకుంది. భువనేశ్వరి స్పందిస్తూ చంద్రబాబు త్వరలో మళ్లీ సీఎం అవుతారని, వైసీపీ ప్రభుత్వ బాధితులందరికీ న్యాయం చేస్తారని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

- చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో తీవ్ర మనస్తాపానికి గురై చనిపోయిన బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం గ్రామానికి చెందిన అప్పలబత్తుల అయ్యన్నాచారి భార్య సత్యవతికి రూ.3 లక్షల చెక్కును అందచేశారు.
- రావికమతం మండలం గంపవానిపాలెంలో మాకిరెడ్డి పెద్దిమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, పిల్లలను బాగా చదివించాలని మృతురాలి కుమారుడు రాజుబాబు, కోడలు భవానీకి సూచించారు. కాగా భువనేశ్వరి గంపవానిపాలెం వస్తున్నట్టు తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జై చంద్రబాబు, జై భువనమ్మ, జై టీడీపీ అంటూ నినాదాలు చేశారు.
- రోలుగుంట మండలం జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన సుర్ల దేముడమ్మ, కొవ్వూరు గ్రామంలో యర్రంశెట్టి సత్యనారాయణ కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు.
- మునగపాక మండల అరబుపాలెంలో బడ్డేడ నాయుడు, వాడ్రాపల్లిలో ఉల్లూరి అప్పలనరస, ఊల్లూరి మంగయ్యమ, గొల్లలపాలెంలో మొల్లి అప్పలనరస కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. మునగపాక మండలంలో పర్యటన అనంతరం భువనేశ్వరి అచ్యుతాపు రం బయలుదేరి వెళ్లారు. రాత్రికి అక్కడ బసచేస్తారని పార్టీ వర్గాలు తెలిపారు.
- నారా భువనేశ్వరి పర్యటనలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, =తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, టీడీపీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీజీ కుమార్, ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, దాడి రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గం

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చోడవరం, ఫిబ్రవరి 29: స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయం మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను గురువారం రాత్రి ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఆవిష్కరించారు. ఈనెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ జరిగే శివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ధర్మశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్యనారాయణ, కమిటీ సభ్యులు అర్చకులు కొడమంచిలి చలపతి, ఈలయ ఈవో ఎస్‌వీవీ. సత్యనారాయణ పాల్గొన్నారు.

7న మండల సమావేశం

చోడవరం, ఫిబ్రవరి 29: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 7న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె. రమామణి గురువారం తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు తీవ్ర మనస్థాపానికి గురై చనిపోయిన అంకాబత్తుల అప్పలాచారి భార్య సత్యవతికి రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న నారా భువనేశ్వరి



రావికమతం మండలం గంపవానిపాలెంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు మనస్థాపంతో మృతి చెందిన పెద్దిమ్మ కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న నారా భువనేశ్వరి



రోలుగుంట మండలం కొవ్వూరులో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో మృతి చెందిన యర్రంశెట్టి సత్యనారాయణ కుటుంబానికి చెక్కు అందిస్తున్న నారా భువనేశ్వరి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధం చేసిన బెంచీలు

మాడుగుల, ఫిబ్రవరి 29: ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాటు చేశామని మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ నాగమోహిని తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు 238, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 453 మంది రాస్తున్నారని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు హాజరు కావాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

దేవరాపల్లిలో..

మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తిచేసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ వి.ఉమామహేశ్వరి, డిపార్టుమెంట్ అధికారి సన్యాసిరావు గురువారం తెలిపారు. దేవరాపల్లి జూనియర్ కళాశాలతోపాటు తెనుగుపూడి, అంబేడ్కర్ గురుకుల కళాశాల, బేతపూడి కేజీబీవీ, శారదాశ్రీ, పీవీసీ ఒకేషనల్ కళాశాలల్లో మొదటి సంవత్సరం 237, ద్వితీయ సంవత్సరం 250, ప్రైవేటు 25 మంది విద్యార్థులు రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు 45 నిమిషాలు ముందుగా విద్యార్థులు హాజరు కావాలన్నారు.

మాడుగులలో జలజీవన్ మిషన్ కొళాయిలు ప్రారంభం

తాచేరు వంతెనకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి బూడి



మాడుగులలో కొళాయిలను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

మాడుగుల, ఫిబ్రవరి 29 : మాడుగులలో రూ.9.92 కోట్లతో చేపట్టిన జలజీవన్ మిషన్ కొళాయిలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు గురువారం ప్రారంభించారు. అలాగే మాడుగుల నుంచి సాగరం వెళ్లే దారిలో తాచేరు వంతెన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. తాచేరు వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం. మాజీ ఎంపీపీ పెదబాబు, సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్బీకే, సీసీ రోడ్లు ప్రారంభం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని తాటిపర్తి, సాగరం గ్రామాల్లో గురువారం ఆర్‌బీకే, సీసీ రోడ్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. తాటిపర్తిలో రూ.23.94లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, సాగరంలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్, మండల పార్టీ అధ్యక్షుడు రామదర్మజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ తీర్థం గోడపత్రిక ఆవిష్కరణ



మోదకొండమ్మ తీర్థం గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న వర్తక సంఘం సభ్యులు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కొలువైన మోదకొండమ్మ తీర్థం మూడో తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు తీర్థ మహోత్సవానికి సంబంధించిన గోడ పత్రికను గురువారం స్థానిక వర్తక సంఘం సభ్యులు, స్థానికులు ఆవిష్కరించారు. ఆరోజు వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. కోలాటాలు, గుర్రపు పందేలు, కబడ్డీ పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టా బలరాం, కోట్ని సత్తిబాబు, చిన్న, రాకుర్తి వెంకటరావు, వెంకటరావు, పుట్టా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో మెలకువలపై అవగాహన



సిబ్బంది అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 29: జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెలకువలపై పశువైద్యులకు, ఆర్బీకే పశు వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. గురువారం పాడేరు డివిజన్ పరిధిలోని మాడుగుల, చీడికాడ మండలాల పశు వైద్యులు, పారా వెట్ సిబ్బంది, గోపాలమిత్రలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన పాడేరు డివిజన్ ఉప సంచాలకులు సీహెచ్ నరసింహులు పలు అంశాలను వివరించారు.

వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల దీక్షలు

చోడవరం, ఫిబ్రవరి 29: వేతన బకాయిల కోసం ఆందోళన చేపట్టిన పంచాయతీ కార్మికుల నిరాహార దీక్షలు గురువారం రెండో రోజు కూడా కొనసాగాయి. పంచాయతీ కార్మికులు వేతన బకాయిలు కోసం ఆందోళన చేస్తున్నా, అధికారులు కనీసం స్పందించకపోవడంపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు బకాయిలు చెల్లించేంత వరకూ తాము విధుల్లోనికి హాజరయ్యేది లేదని ఆయన స్పష్టంచేశారు. ఈ ఆందోళనలో పారిశుధ్య కార్మికుల సంఘం కార్మికులు పొట్నూరు అప్పారావు, గణేష్, అప్పలరాజు, నాగు, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరిని మర్యాద పూర్వకంగా కలిసిన నాయకులు



భువనేశ్వరికి పూష్ప గుచ్ఛం అందిస్తున్న శ్రీరామ్మూర్తి, బాలాజీ



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామానాయుడు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 29: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఆర్.భీమవరం వచ్చిన మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కోట్ని బాలాజీ, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం తమ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితిని ఆమెకు వివరించారు.

చీడికాడలో.. నిజం గెలవాలి అనే కార్యక్రమానికి నర్సీపట్నం వచ్చిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని గురువారం మాజీఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిని కూడా కలిశారు. అనంతరం మాడుగుల నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితినిఆమెకు వివరించారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, టీడీపీ నాయకులు పైలా ముత్యాలనాయుడు, కొల్లి నూకినాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

పడిపోయిన టమాటా ధర



మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన టమాటా

దేవరాపల్లి, ఫిబ్రవరి 29: స్థానిక కూరగాయల మార్కెట్‌లో టమాటా ధర పడిపోయింది. రెండు రోజుల క్రితం వరకు క్రేటు టమాటా(20 కిలోలు) రూ.500 నుంచి రూ.600 వరకు వ్యాపారులు కొనుగోలు చేయగా గురువారం రూ.200లకు పడిపోయింది. మార్కెట్‌కు టామాటా ఎక్కువగా రావడంతో ధర పడిపోయింది. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు వేసి చూసిన ధర పెరగకపోవడంతో తిరిగి ఇంటికి తీసుకు వెళ్లలేక రైతులు రూ.200లకు విక్రయించారు. అనకాపల్లి, విశాఖపట్నం, పాడేరు, కె.కోటపాడు, మండలాల నుంచి వ్యాపారస్థులు వచ్చారు.

మంచాలలో 42మందికి వైద్య పరీక్షలు

చీడికాడ, ఫిబ్రవరి 29: మండలంలోని మంచాల పాలకేంద్రం వద్ద గురువారం జరిగిన వైద్య శిబిరంలో 42 మందికి పరీక్షలు చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి సునీల్‌కుమార్ రోగులందరికీ తనిఖీలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చినబాబు, హెచ్‌వీ భవానీ, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశవర్కర్‌లు సేవలు అందించారు.

సకాలంలో చెల్లించిన రైతులకు సున్నావడ్డీ వర్తింపు

దేవరాపల్లి, ఫిబ్రవరి 29: వ్యవసాయ రుణం సకాలంలో చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ వర్తిస్తుందని వ్యవసాయ అధికారి ఎల్‌వై.కాంతమ్మ అన్నారు. గురువారం సున్నా వడ్డీపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2021-2022 రబీకి గాను 36 రెవెన్యూ గ్రామాల్లో 1,508 రైతులకు గాను రూ.27లక్షలు54వేలు, 2022-2023 ఖరీఫ్‌లో 37 రెవెన్యూ గ్రామాల్లో 1,100 మంది రైతులకు 23లక్షలు 40వేలు రైతు ఖాతాలోకి జమ అయిందన్నారు. లబ్ధి పొందిన రైతు వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో వేలాడదీశామన్నారు.

పలు గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్ర

కె.కోటపాడు, ఫిబ్రవరి 29 : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజాపోరు యాత్రను బీజేపీ మండల నాయకులు గురువారం నిర్వహించారు. మండలంలోని మర్రివలస, సూదివలస, గొండుపాలెం, బత్తివానిపాలెం తదితర గ్రామాల్లో జరిగిన ప్రజాపోరు యాత్రలో బీజేపీ మండల అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. దీనిని వైసీపీ ప్రభుత్వం తన సొంత నిధులుగా చెప్పుకుంటూ పబ్బాలు గడుపుకుంటూ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ బీవీఎస్ వర్మ, అసెంబ్లీ కో-కన్వీనర్ మేడపరెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ సీనియర్ నాయకులు బీవీఎస్ రామకృష్ణరాజు, మండల బీసీ సెల్ నాయకులు దొగ్గ రమణ, పోరు యాత్ర మండల కన్వీనర్ సబ్బవరపు శివస్వామినాయుడు, మండల కార్యదర్శి ఇమందే సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'పార్టీకి నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి'

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 29: పార్టీలో ఉంటూ నష్టం కలిగిస్తున్న వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ దొండా కన్నబాబులపై చర్యలు తీసుకోవాలని వైసీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, స్వలబ్ధికి వైసీపీ అధికారంలోకి వచ్చాక కొంత మంది ఇతర పార్టీల నుంచి చేరారన్నారు. వారి ఆటలను ఎమ్మెల్యే కె.ధర్మశ్రీ సాగనివ్వకపోవడంతో ఆయన ప్రతిష్ఠ దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. పాలకవర్గాన్ని పక్కన పెట్టి పంచాయతీ పాలన అధికారాలు తనకు కట్టబెట్టారని ఆరోపణలను ఖండించారు. చోడవరం సీటు ధర్మశ్రీకి దక్కకూడదని కొంత మంది చేస్తున్న కుట్రలో భాగంగానే ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.